క్లుప్తంగా

నేటి బంద్ విజయవంతానికి పిలుపు



గుడ్లవల్లేరు: వర్గీకరణ, క్రిమీలేయర్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ గుడ్లవల్లేరులో బుధవారం బంద్‌ను నిర్వహిస్తున్నామని అఖిల భారత ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తెలిపారు. గుడ్లవల్లేరు బస్టాండ్ సెంటర్‌లోని మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమితి నాయకులు గుదే రవి, గురజ రాంబాబు, పెయ్యల సురేష్, దారం నిరంజనరావు, రాజు, కోటేశ్వర రావు పాల్గొన్నారు.

జనసేన పార్టీ దిమ్మ ధ్వంసం ఘటనకు ఖండన

గుడివాడరూరల్: గుడివాడ నాగవరప్పాడు సెంటర్‌లో జనసేన పార్టీ జెండా దిమ్మను ధ్వంసం చేసిన చర్యను గుడివాడ టీడీపీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. పట్టణంలోని ఏలూరురోడ్డులో ఉన్న ప్రజావేదిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ, కామేపల్లి తులసి, వాసే మురళీలు మాట్లాడుతూ నాగవరప్పాడులో సెంటర్‌లో జనసేన పార్టీ జెండా దిమ్మను దారం నరసింహారావు ధ్వంసం చేయడం దారుణమన్నారు. అతనిపై పార్టీపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావుకు నివేదిక ఇచ్చామన్నారు. మనస్తాపానికి గురైన జనసైనికులకు క్షమాపణలు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి జరగకుండా చూసుకుంటామని వారు తెలిపారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రాజేంద్రప్రసాద్ మృతి తీరనిలోటు



బార్లపూడి(మొవ్వ): మొవ్వ మండలం బార్లపూడి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిన మాజీ సర్పంచ్ కోనేరు రాజేంద్రప్రసాద్(బుల్లి బాబు)(86) మృతి తీరనిలోటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 10 ఏళ్లు బార్లపూడి గ్రామ సర్పంచ్‌గా, రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యునిగా, కూచిపూడి రోటరీ సభ్యులుగా సంజీవని వైద్యాలయం సలహా మండలి సభ్యులుగా ఉంటూ సమాజ సేవ చేస్తూ అనేక మంది విద్యార్థులకు తన వంతు ఆర్థిక సహాయం చేసిన ఆయన అంత్యక్రియలను మంగళవారం ఆయన స్వగ్రామమైన బార్లపూడిలో నిర్వహించారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి, రోటరీ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్, రెడ్ క్రాస్ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, రోటరీ, రెడ్ క్రాస్ సభ్యులు పామర్తి శివకుమార్, పిన్నమనేని గోపాల కృష్ణ, డాక్టర్ విష్ణు వర్ధన్ రావు, దోనేపూడి శివరామయ్య, మద్దాలి కామేశ్వరరావు, డి.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొని రాజేంద్రప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించారు.

23న అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూ

మండవల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల నియామకానికి ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవితేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి గౌరవ వేతనం గరిష్టంగా నెలకు రూ.10 వేలు, గంటకు రూ.150 ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. పీజీలో 55 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. తెలుగు-1, ఫిజిక్స్-1, హిస్టరీ సబ్జెక్టులకు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 21, 22 తేదీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

గుడివాడ వన్‌టౌన్ సీఐగా కొండపల్లి శ్రీనివాస్



గుడివాడరూరల్: గుడివాడ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో(సీఐ)గా కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేసిన కె.ఇంద్రశ్రీనివాస్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి సీఐగా ఎల్.రమేష్ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు వీఆర్‌లో ఉన్న కొండపల్లి శ్రీనివాస్‌ను పోలీసు ఉన్నతాధికారులు గుడివాడ వన్‌టౌన్ సీఐగా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల వలయంలో టిడ్కో లబ్ధిదారులు

- వెంటాడుతున్న నీరు, పారిశుద్ధ్య కష్టాలు
- వరుస చోరీలతో బెంబేలు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



టిడ్కో గృహాల సముదాయం

గుడివాడ టౌన్: పట్టణంలోని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు కోట్లాది రూపాయలు వెచ్చించి 220 బ్లాకుల్లో 8,917 ఇళ్లు నిర్మించి అన్ని వసతులతో తాళాలు లబ్ధిదారులకు అందజేశారు. అప్పటికే మౌలిక వసతులన్నీ కల్పించి గృహ ప్రవేశాలు చేశారు. అనంతరం లబ్ధిదారులు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వసతులు సక్రమంగా వినియోగంలోకి రాకపోవడంతో సమస్యలతో సతమతమవుతున్నారు. అప్పట్లో లబ్ధిదారుల నీటి వసతికి 18 లక్షల లీటర్ల కెపాసిటీ ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. పంపుల చెరువు నుంచి నేరుగా ట్యాంకు నింపేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండేందుకు సంప్ సైతం ఏర్పాటు చేశారు. అధునాతన విధానాన్ని అమలులోకి తెస్తూ 80 అడుగుల ఎత్తులో ట్యాంకు నిర్మించారు. ట్యాంకు పూర్తిగా నిండితే లబ్ధిదారులు మోటార్లు అవసరం లేకుండానే గ్రావిటీ ద్వారా నీరు ఇళ్లపై ట్యాంకులకు చేరతాయి. అయితే ప్రస్తుతం అధికారులు పూర్తి స్థాయిలో ట్యాంకు నింపకపోవడంతో గ్రావిటీ తగ్గి నీరు కావలసిన స్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదు. నీటి వసతి సరిగా లేకపోవడం వలన కొందరు లబ్ధిదారులు ఇంకా గృహాలకు చేరడంలేదు.

దోమల బెడదతో అవస్థలు..



పేరుకుపోయిన చెత్త నిల్వలు

అక్కడ ఖాళీ ఇళ్లలో లైట్లు, ఇతర సామగ్రిని దొంగలు చోరీ చేస్తున్నారు. ఇక పారిశుద్ధ్య సమస్యకు వస్తే సుమారు 9 వేల గృహాలకు సంబంధించి కేవలం 10 మంది పారిశుద్ధ్య కార్మికులను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీరు పూర్తి స్థాయిలో పనిచేసినా టిడ్కో కాలనీలో సేవలు అందించలేకపోతున్నారు. కార్మికుల కొరత కారణంగా ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతుందని తద్వారా దోమల బెడద అధికమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని లబ్ధిదారులు కోరుకుంటున్నారు. మురుగునీరు పారుదల విషయంలో నీటిని శుద్ధి చేసే రీట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ దానిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రస్తుత పాలక వర్గం విఫలమైందని స్థానికులు వాపోతున్నారు.

రుణభారం పెరిగిపోతుంది..



గత ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో గృహాలకు సంబంధించిన బ్యాంకు రుణాలు రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఒక అడుగు ముందుకేసి అవసరమైతే తన సొంత నిధులతో బకాయిలు తీరుస్తానని చెప్పారు. ఏ ప్రభుత్వం వచ్చినా రుణం రద్దు అవుతుందని భావించి కట్టాల్సిన వాయిదాలు చెల్లించక పోవడంతో రుణభారం అధికమైంది. వెంటనే రుణాలు రద్దు చేయాలి.

– బసవ అరుణ, లబ్ధిదారు

నీటి సమస్యను పరిష్కరించాలి..



టిడ్కో గృహాల్లో నీటి సమస్య అధికంగా ఉంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నీటి ట్యాంకులు నిర్మించినా పూర్తి స్థాయిలో నింపకపోవడం, ఖాళీగా ఉన్న ఇళ్లలో కుళాయిలు దొంగిలించడంతో నీటి వాడకం కట్టడి లేకుండాపోయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నీటి సరఫరా విషయంలో అధికారులు అధ్యాయనం చేసి సమస్యకు పరిష్కారం కనుగొని అమలు చేయాలి. అప్పుడే లబ్ధిదారునికి పూర్తి స్థాయిలో నీరు అందుతుంది.

– ఆర్.శివరామ్ ప్రసాద్, లబ్ధిదారుడు

తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటల సాగు

జిల్లా వ్యవసాయధికారి పద్మావతి



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి తదితరులు

పామర్రు: తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలను పండించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి పేర్కొన్నారు. గ్రామంలో పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని సూచించారు. రైతులకు 'బ్యాలెట్ టెస్ట్' నిర్వహించారు. రైతులు పొలం పరిసరాల విశ్లేషణ చేసుకుని అవసరం మేరకు పురుగు మందులు వాడాలన్నారు. రైతులు పొలంలో ఏమేరకు విత్తనాలను చల్లారని, నారుమడ్ల సమయంలో తీసుకోవాల్సిన పద్ధతులను, ఏసమయంలో ఎటువంటి ఎరువులు వాడాలనే అంశాలు ఈ టెస్టులో ఉంటాయని తెలిపారు. వీటికి సరైన సమాధానం చెప్పిన రైతులను అభినందించారు. అనంతరం మండల పరిధిలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతులందరూ సెప్టెంబరు 15వ తేదీలోగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పామర్రు ఏడీఏ స్వర్ణలత, మండల వ్యవసాయాధికారి శివ నాగరాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వైద్యులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి



కైకలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్నర్ స్టోన్ ఒకేషనల్ విద్యార్థులు

కైకలూరు: విధి నిర్వహణలో వైద్యులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కైకలూరు కార్నర్ స్టోన్ ఒకేషనల్ కాలేజీ కాలేజి ప్రిన్సిపాల్ బి.లక్ష్మీనారాయణ కోరారు. బస్టాండ్ నుంచి పెద్ద మసీదు వరకు మంగళవారం మెడికల్ టెక్నీషియన్, నర్సింగ్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన అత్యంత హేయమన్నారు. ఇటువంటి సంఘటనలు మరోసారి పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలాజీ, మేరీ, మేఘన, గంగారత్నం, యామిని, సత్య పాల్గొన్నారు.

సమగ్ర విచారణకు డిమాండ్



పామర్రులో మాట్లాడుతున్న పాస్టర్ల సంఘం సభ్యులు

పామర్రు: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌హెచ్ నగర్‌లోని పాస్టర్స్ కార్యాలయంలో పాస్టర్ల సంఘ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కతాలో డాక్టర్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మానవ సమాజంలో ఇటువంటి ఘటనలు జరగటం దురదృష్టకరమని చెప్పారు. హ్యూమన్ రైట్స్ చైర్మన్ డాక్టర్ జి.కె.బాబు మాట్లాడుతూ.. హత్యకు పాల్పడిన దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఆవుల ప్రవీణ్‌కుమార్, పలు గ్రామాల సంస్థల ప్రతినిధులు పాల్గొని జూనియర్ డాక్టర్ హత్యను ఖండించారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ భానుశ్రీ

పెదమద్దాలి(పామర్రు): బాలల చట్టాలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సీడీపీఓ వి.భానుశ్రీ అన్నారు. మండల పరిధి పెదమద్దాలి గ్రామంలో మిషన్ శక్తి 100 డేస్ అవేర్‌నెస్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ పాల్గొని మాట్లాడుతూ.. సఖి వన్ స్టాప్ సెంటర్‌లో పలు రకాల సేవలను అందజేస్తోందన్నారు. అవసరం ఉన్న మహిళలకు ఐదు రోజుల పాటు తాత్కాలిక వసతి ఏర్పాటు, ఉచిత న్యాయ సేవ, కౌన్సెలింగ్, పోలీస్ సపోర్టు, వైద్య సేవలను బాధిత మహిళలు, బాలికలకు ఈ కేంద్రం ద్వారా అందిస్తారని చెప్పారు.

పోక్సో చట్టం ద్వారా చర్యలు..

బాధిత మహిళలు, బాలికలకు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబరు ఉమెన్స్ హెల్ప్ లైన్-181, 1098, 100, 112 నంబర్లకు కాల్ చేయవచ్చన్నారు. బాధితులు లేదా వారి తరఫున ఎన్జీవోలు, బంధువులు, తల్లిదండ్రులు స్వయంగా ఈ కేంద్రాలను ఆశ్రయించవచ్చని చెప్పారు. అదే విధంగా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ వారి మరో స్కీమ్ అయిన 'మిషన్ వాత్సల్య స్కీమ్‌లో భాగంగా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 యూనిట్‌లు శిశు, బాల బాలికలకు సంబంధించిన అంశాలపై విధులు నిర్వహిస్తారన్నారు. పోక్సో చట్టం ద్వారా అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లీగల్ ఎడాప్షన్స్ తదితర అంశాలపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వన్ స్టాప్ యూనిట్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పి.అర్చిష్మ, కేస్ ఉమెన్ ఎస్.శిరీష, ఏసీడీపీఓ పద్మావతి, సోషల్ వర్కర్ గుమ్మడి ప్రేమలత, కౌన్సిలర్ స్వరాజ్యం, చైల్డ్ లైన్ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థిక సాయం అందజేత



అనాథలు, సంరక్షకులతో ఐసీడీఎస్ సిబ్బంది

కైకలూరు: మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 23 మంది అనాథలకు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. కైకలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో అనాథలు, సంరక్షకులకు అవగాహన సమావేశం ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ వి.దీప్తి అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక్కో అనాథకు రూ.4000 చొప్పున 6 నెలలకు రూ.24,000 బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. ఏలూరు జిల్లా పిల్లల సంరక్షణ అధికారి డాక్టర్ సూర్య చంద్రవేణి మాట్లాడుతూ జమ చేసిన నగదును సంరక్షకులు కేవలం పిల్లల చదువుల నిమిత్తం మాత్రమే వినియోగించాలన్నారు. సొంత అవసరాలకు ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్ఎన్.ఉమామహేశ్వరరావు, ఎంఈఓ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, కృష్ణకుమారి, షాహినాఖానం, ప్రసన్న, నాగలక్ష్మి, కరుణకుమారి, సుందరి, ఝాన్సీ, ప్రసూధ, సంరక్షకులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కైకలూరు: చిన్న దోమ ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతోందని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం కాలేజీలో విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ, జికా, చికున్ గున్యా, పసుపు జ్వరం రావడానికి దోమలు కారణమన్నారు. ప్రతీ ఏటా అనేక మంది దోమకాటుకు గురై మరణిస్తున్నారని చెప్పారు.

జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 1897లో సర్ రొనాల్డ్ రాస్ మలేరియా వ్యాప్తికి దోమలకు సంబంధం ఉందని గుర్తించారన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా దోమల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. తిలాపియా, కార్ప్, మిన్నోస్ జాతుల చేపలను పెంచడం వలన అవి దోమల లార్వాలను తింటాయన్నారు. సెకండ్ బీఎస్సీ జువాలజీ (ఆనర్స్) విద్యార్థి ఎస్.దీపిక దోమల జాతులు, లక్షణాలు, వ్యాధులపై అందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయ ప్రకాష్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ కో-ఆర్డినేటర్ ఎన్.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండంగి ఎత్తిపోతల పథకం పునఃప్రారంభం



కొండంగి ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కలిదిండి(కైకలూరు): కొండంగి ఎత్తిపోతల పథకం మరో పట్టిసీమ పథకమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కలిదిండి మండలం కొండంగిలో ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పైపుల ద్వారా కొండంగికి తరలించామన్నారు. సమీప గ్రామాలకు తాగునీరు, చేపల రైతులకు నీటిని దీని ద్వారా సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, వీరమల్లు నరసింహారావు, కూటమి నేతలు జోగిరాజు, నున్న రమాదేవి, తాడినాడ బాబు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, చిట్టూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

గుడివాడ టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మూడో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, 8వ తరగతి పాసైన యువతీ యువకులు అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. ఈ నెల 29న ప్రభుత్వ ఐటీఐలకు, 31న ప్రైవేట్ ఐటీఐలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 08674-295953, 82975 74757 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కొల్లేరు సమస్యలను పరిష్కరించండి



సీఎం చంద్రబాబు నాయుడితో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: కొల్లేరు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు ఆక్వా రైతులకు విద్యుత్ చార్జీల్లో రాయితీలు కల్పించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సెక్రటేరియట్‌లో సీఎం చంద్రబాబు నాయుడిని కలిసి మంగళవారం కోరారు. అనంతరం కామినేని మాట్లాడుతూ.. ఆక్వా చెరువుల కారణంగా అనేక గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని దీని వలన ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నీటి సమస్య పరిష్కరించడానికి సహకారం అందించాలని కోరానన్నారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు కామినేని తెలిపారు.

వాహనాల విడిభాగాల వేలం

కోనేరుసెంటర్: పోలీసుశాఖకు సంబంధించిన వాహనాల మరమ్మతులు అనంతరం నిర్వహించిన విడిభాగాల వేలంలో రూ.31,600 ఆదాయం లభించింది. ఇటీవల పలు వాహనాలకు మరమ్మతులు చేపట్టిన అధికారులు వాటిలో పనికిరాని విడిభాగాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో మచిలీపట్నంకు చెందిన బిడ్డర్‌లు పలువురు పోటీపడగా సర్దార్ అనే బిడ్డర్ అత్యధికంగా రూ.31,600లకు విడి భాగాలను దక్కించుకున్నాడు. ఇన్‌చార్జి ఏఎస్పీ ప్రసాద్, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రంగనాథ్, ఆర్ఐ వెల్ఫేర్ బి.రాఘవయ్య, ఆర్ఐ వై.రవికిరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నందివాడ: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నందివాడ ఎస్ఐ కె.శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని వెన్ననపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై ఎస్ఐ శ్రీనివాసు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. ఆడపిల్లల పట్ల గౌరవంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఆడ పిల్లలు ప్రతి విషయం తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆకతాయిలు, అల్లరి మూకలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

సుబ్రమణ్యేశ్వర ఆలయంలో అన్న సమారాధన

కైకలూరు: స్థానిక చిన్న చెరువు గట్టు సమీప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో అఖండ అన్నసమారాధనను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, కూటమి నేతలు మంగినేని రామకృష్ణ, పూల రాజీ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి ఈ అభిషేకాలు నిర్వహించారు. అలాగే భారీ సంఖ్యలో అన్నప్రాసనలు నిర్వహించారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

హోమియో పిల్స్ వైద్య సేవలు



కూచిపూడి(మొవ్వ): పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు డాక్టర్ కోసూరు రామకృష్ణనంద రాజు(పోడూరు రాజు)కు చెందిన శ్రీ రామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మొవ్వ మండలం కూచిపూడిలో హోమియోపతి ఉచిత మొబైల్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. హోమియో పిల్స్ వైద్య బృందం గ్రామంలోని 45 మందికి టెలి కాలింగ్ వైద్య విధానం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలు దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు తగు సలహాలను అందజేశారు.

కవి వెంకటేశ్వరరావు మృతికి సంతాపం

మండవల్లి: మండలంలోని పులపర్రులో ప్రముఖ కవి మోరు వెంకటేశ్వరరావు అకాల మరణం పట్ల ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

సర్దుబాటు టీచర్లకు కౌన్సెలింగ్

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కౌన్సెలింగ్ సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ఎంఈఓ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మండలంలోని పాఠశాలలకు చెందిన 36 మంది మిగులు ఉపాధ్యాయులు సర్దుబాటుకు అంగీకారం తెలిపారు. వీరిలో 13 మందిని మండలంలోని 11 పాఠశాలలకు సర్దుబాటు చేశారు. నలుగురు మినిమం టైంస్కేల్ టీచర్లు, ఒక మ్యాథ్స్ సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు, 18 మంది తెలుగు, ఇంగ్లిషు పండిట్‌లను డివిజన్‌లోని ఇతర మండలాల పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు బేతాల రాజేంద్రప్రసాద్, దుర్గాప్రసాద్, బేతాలరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఇండియన్ బ్యాంక్ కస్టమర్ల మీట్

మండవల్లి: ఇండియన్ బ్యాంక్ కస్టమర్ల మీట్ కార్యక్రమం ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో అతి పెద్ద బ్యాంక్‌గా ఉన్న ఇండియన్ బ్యాంక్ 2024 మార్చి నాటికి రూ.44 కోట్ల 83 లక్షల డిపాజిట్లు సేకరించిందన్నారు. వ్యాపారాలకు, డ్వాక్రా గ్రూపు మహిళలకు గోల్డ్ లోన్లు, ఆక్వా తదితరాలకు రూ.77 కోట్ల 13 లక్షలు ఖాతాదారులకు అందించామన్నారు. ఖాతాదారులు, సర్పంచ్‌లు పాల్గొనాలని ఆయన కోరారు.

28న చెరువుల లీజు వేలం

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయానికి చెందిన చెరువుల లీజు వేలం ఈ నెల 28న నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి గుడివాడ రూరల్ మండలం మోటూరులో 110.9 ఎకరాల చేపల చెరువులు ఉన్నాయన్నారు. ఈ చెరువులను మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు మోటూరు గ్రామ సచివాలయం వద్ద వేలం నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని చెప్పారు.